తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
బుధవారం
07 అక్టోబర్ 2026

## బాలానగర్-గంగాపూర్ రహదారి అధ్వానం..



- ప్రయాణికులకు తప్పని తిప్పలు!

**బాలానగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** బాలానగర్ నుంచి గంగాపూర్ వెళ్లే రహదారి పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. పెద్దారెవెల్లి నుంచి తిరుమలగిరి మీదుగా గంగాపూర్ వరకు ఉన్న రహదారిపై కంకర పరిచి బీటీ పనులు పూర్తి చేయకపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పనులు ప్రారంభమై చాలాకాలం గడుస్తున్నా పూర్తిస్థాయిలో బీటీ వేయకపోవడంతో ప్రయాణికుల్లో అసహనం వ్యక్తమవుతోంది.

ఈ రహదారి మీదుగా బాలానగర్, గంగాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు, ఉద్యోగులు, కూలీలు, రైతులు తమ రోజువారీ అవసరాల కోసం ఈ మార్గంపైనే ఆధారపడుతున్నారు. అయితే ప్రస్తుతం రహదారిపై కంకర రాళ్లు చెల్లాచెదురుగా ఉండటం, పలుచోట్ల రహదారి ఎత్తుపల్లాలతో ఉండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

**చిన్నారులు, వృద్ధులకు మరింత ఇబ్బందులు...**

రహదారి అధ్వానంగా మారడంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకరపై వాహనాలు జారిపడే ప్రమాదం ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. చిన్నపిల్లలను తీసుకెళ్లే తల్లిదండ్రులు, వృద్ధులు ఈ రహదారిపై ప్రయాణించేందుకు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. రాత్రి వేళల్లో రహదారి పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని స్థానికులు అంటున్నారు.

*మిగతా 10లో..*

## నశాముక్త సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కీలకం

- మాదకద్రవ్యాలకు దూరంగా విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వైపు అడుగులు వేయాలి
- నశాముక్త భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల

*మిగతా 10లో..*





**మెదక్ బ్యూరో, అక్టోబర్ 6(జనంసాక్షి):** మెదక్ కలెక్టరేట్‌లో 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా బుధవారం నిర్వహించిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నశాముక్త సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, మాదకద్రవ్యాల ప్రభావానికి దూరంగా ఉంటూ విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి మరియు దేశసేవ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఈ అభియాన్ ఒక విస్తృత ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. కేవలం చట్టపరమైన చర్యలే కాకుండా యువతలో చైతన్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ డ్రగ్స్ నియంత్రణకు చేస్తున్న కృషిని, విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీల ఏర్పాటును గవర్నర్ అభినందించారు. విద్యాసంస్థల వద్ద మత్తు పదార్థాల లభ్యతను అరికట్టడంతో పాటు పునరావాస సేవలను విస్తరించాలని, పోలీసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆరోగ్యవంతమైన యువతే 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాకారం చేస్తుందన్నారు.

## రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి కాంట్రాక్ట్ కరోబార్

- మ్యుటేషన్ దరఖాస్తు ఫైల్ ప్రాసెసింగ్‌కు రూ.20 వేలు డిమాండ్
- చివరకు రూ.15 వేలకు బేరం
- జక్కాపూర్ పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ వల
- కాంట్రాక్ట్ కరోబార్ వద్ద లంచం సొమ్ము స్వాధీనం



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి):** లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి, కాంట్రాక్ట్ కరోబార్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జక్కాపూర్ పంచాయతీ కార్యదర్శి బి. అరుణ, కాంట్రాక్ట్ కరోబార్ దాసరి సంతోష్ లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా పట్టుబడ్డారు.

*మిగతా 10లో..*

## వనపర్తిలో క్రీడా సంబురం..
## 16, 17న జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్

- ఏడు క్రీడల్లో పోటీలు.. విజేతలకు నగదు బహుమతులు



**వనపర్తి, బ్యూరో అక్టోబర్ 6 (జనంసాక్షి):** దసరా పండుగను పురస్కరించుకుని యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు అక్టోబర్ 16,17 తేదీల్లో వనపర్తి జిల్లాస్థాయి ఛాంపియన్‌షిప్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు జిల్లా స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహణపై అధికారులతో సమావేశమైన కలెక్టర్.. ప్రతి మండలం నుంచి ప్రతిభావంతులైన క్రీడాకారులతో జట్లను ఎంపిక చేసి, అక్టోబర్ 13లోగా జాబితాలను జిల్లా స్థాయికి పంపించాలని ఆదేశించారు. క్రీడాకారులకు వసతి, భోజనం, తాగునీరు, క్రీడా సామగ్రి తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు.

*మిగతా 4లో..*

## ఉపాధ్యాయులు గైర్హాజరైతే చర్యలు తప్పవు

- ఉపాధ్యాయుల హాజరుపై రోజువారీ నివేదిక ఇవ్వాలి
- ఎఫ్‌ఎల్‌ఎన్ పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ఉపాధ్యాయులు పాఠశాలలకు గైరాజర్ అయితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు.

*మిగతా 7లో..*

## గ్యారంటీ లేనిదే ధాన్యం కేటాయింపు లేదు!

- నిబంధనలు ఉల్లంఘిస్తే మిల్లర్లపై చర్యలు: అదనపు కలెక్టర్ వినోద్ కుమార్



**వనపర్తి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ఖరీఫ్ 2026-27 సీజన్‌లో వరి ధాన్యం కేటాయింపులపై ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబిస్తోంది. నిబంధనల ప్రకారం బ్యాంకు గ్యారంటీ సమర్పించిన రైస్ మిల్లర్లకే ధాన్యం కేటాయిస్తామని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ స్పష్టం చేశారు. గ్యారంటీ సమర్పించకుండా ధాన్యం కేటాయింపులు కోరడం సాధ్యం కాదని తేల్చిచెప్పారు.

మంగళవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ సీజన్ ధాన్యం కేటాయింపులపై నాన్-డిఫాల్టర్ రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 43 రైస్ మిల్లులు నాన్-డిఫాల్టర్ జాబితాలో ఉన్నాయని, ఆయా మిల్లులకు నిబంధనల మేరకు ధాన్యం కేటాయింపులు చేపడతామని తెలిపారు. ప్రతి మిల్లర్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తప్పనిసరిగా బ్యాంకు గ్యారంటీ సమర్పించాలని ఆదేశించారు.

*మిగతా 8లో..*

## మండలంలో మంత్రి పొన్నం విస్తృత పర్యటన

- వివిధ గ్రామాలలో అభివృద్ధి భూమిపూజ, శంకుస్థాపనలు
- మండలంలో 'పల్లెపల్లెకు పొన్నం అన్న - పల్లెల్లో ప్రజా పాలన
- 1100 ఎకరాలకు సాగునీరు అందించేలా గౌరవెల్లి కాలువ నీరు తీసుకొస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్



**కోహెడ, అక్టోబర్ 06 (జనంసాక్షి):** మండలంలోని పర్వేద, నకెరకొమ్ముల, శ్రీ రాముల పల్లి,కాచాపూర్, సీసీ పల్లి గ్రామాలలో మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ ల మంత్రి పొన్నం ప్రభాకర్ విస్తృత పర్యటన చేశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా అందుతున్నాయా అలాగే ఇంకా ఏం చేయాలి అనే విషయాలను ప్రజల నుంచి నేరుగా తెలుసుకునేందుకు 'పల్లెపల్లెకు పొన్నంఅన్న. పల్లెపల్లెలో ప్రజాపాలన' కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కాచాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ నిధులతో రూ.44.70 లక్షలతో చేపట్టిన దేవుల చెరువు పునరుద్ధరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, నీటి కుంటలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించాలని సూచించారు. పట్టు, జనుము తదితర పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు.

*మిగతా 10లో..*

### టీయూడబ్ల్యూజే హెచ్ 143

## నారాయణఖేడ్ డివిజన్ కార్యవర్గం ఎన్నిక





**నాగల్గిద్ద, అక్టోబర్ 06 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గ టియుడబ్ల్యు జె హెచ్ 143 నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సగర, టెంజ్ రాష్ట్ర అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి,రాష్ట్ర ,జిల్లా నాయకులు ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీయూడబ్ల్యూజే డివిజన్ గౌరవ అధ్యక్షులుగా శ్రీకాంత్ కులకర్ణి, అధ్యక్షుడిగా అమృత్, ప్రధాన కార్యదర్శిగా నర్స పండరి సగర, ఉపాధ్యక్షులుగా వి. పండరిరెడ్డి,పాండు,మారుతి రెడ్డి,సంయుక్త కార్యదర్శిగా ఎన్ ప్రవీణ్ కుమార్ బి.ప్రవీణ్ కుమార్,బీమ్ సింగ్, కోశాధికారిగా వాజిద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కంతి శ్రీనివాస్, సలహాదారులుగా నర్సింలు,సంతోష్ ,రవి చారి, ఈసీ మెంబర్స్‌గా రాజ్ కుమార్, రామచందర్, విజయ్, రమేష్, హులిగొండ, నరసింహారెడ్డి, జనార్దన్ గౌడ్, అబ్దుల్ సయ్యద్, ప్రభాకర్, ప్రశాంత్, శ్రీనివాస్,బస్వెట్టి దత్తాత్రేయ,వెంకట్, సుధాకర్ రెడ్డి,తుక్కరెడ్డి గార్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఎన్నిక కాబడిన సభ్యులందరికీ రాష్ట్ర జిల్లా నాయకులు ఘనంగా సత్కరించారు.

### వివోఏపై దాడి చేసిన

## వ్యక్తిని కఠినంగా శిక్షించాలి: సీఐటీయూ



**కొండపాక, అక్టోబర్ 6 (జనంసాక్షి):** నల్లగొండ జిల్లా పి.కే. మల్లేపల్లి గ్రామంలో విధి నిర్వహణలో ఉన్న దళిత మహిళా వివోఏ (VOA) గవిపల్లి మాధవిపై జరిగిన దాడిని నిరసిస్తూ, కొండపాక తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ లావణ్య రెడ్డికి సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అమ్ముల బాల్ నర్సయ్య మాట్లాడుతూ… గ్రామసభ లో ప్రజల సమక్షంలో మహిళ అని కూడా చూడకుండా అహంకారంతో దాడి చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. గ్రామీణ మహిళలను చైతన్యపరుస్తూ, స్వయం సహా యక సంఘాల రుణాల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్న వివోఏలపై దాడి చేయడం సరికాదన్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పుష్ప, భాగ్యశ్రీ, లావణ్య, అనిత, మహాలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్చారం గ్రామంలో వన్యప్రాణి అవేర్నెస్ ప్రోగ్రాం

- **గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్ ఆధ్వర్యంలో**



**కొల్చారం, అక్టోబర్ 06 (జనంసాక్షి):** కొల్చారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సర్పంచ్ దేవన్న గారి శేఖర్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవీందర్ వన్యప్రాణి మహోత్సవ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవ వైద్య పరిరక్షణ, అంతరించిపోతున్న వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సమతుల్యత పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఫొటోగ్రఫీ, లఘుచిత్రాల పోటీలు

- **ఎస్పీ పారితోష్ పంకజ్**



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 6 (జనంసాక్షి):** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకొని తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ, లఘుచిత్రాల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, లఘుచిత్రాల రూపకర్తలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోలీసుల విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రతిబింబించే అంశాలపై 2025 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు తీసిన మూడు ఫొటోలు, అలాగే మూడు నిమిషాలకు మించని లఘుచిత్రాలను ఈ నెల 22వ తేదీలోగా అందజేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో వచ్చిన ప్రవేశికల్లో ఉత్తమ మూడు లఘుచిత్రాలు, మూడు ఫొటోలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎస్పీ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన వారికి ప్రతిభా ధ్రువపత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు. 10 × 8 అంగుళాల పరిమాణంలో మూడు ఫొటోల ముద్రిత ప్రతు లతో పాటు, వాటి డిజిటల్ ప్రతులు, లఘుచిత్రాన్ని పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలోని పీఆర్‌ఓ విభాగంలో ఈ నెల 22వ తేదీలోగా అందజేయాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ కోరారు. మరిన్ని వివరాలకు పీఆర్‌ఓ: 8712539040ను సంప్రదించాలి.

### బాధిత కుటుంబాలకు రూ. 10 వేల

## ఆర్థికసాయం అందించిన రమాకాంత్ రెడ్డి



**శివ్వంపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో ఇటీవల మరణించిన దాసరి అంజయ్య, ఇరగ సాయమ్మ కుటుంబాలను మాజీ వైస్ ఎంపీపీ రేవా రమాకాంత్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని భరోసానిస్తూ, ఒక్కో కుటుంబానికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 10,000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఆలయ కమిటీ చైర్మన్ శివకుమార్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృతి..



**చిన్నశంకరంపేట, అక్టోబర్ 06 (జనం సాక్షి):** చిన్నశంకరంపేట మండల పరిధిలోని దరిపల్లి గ్రామంలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో ఐదు గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన జంగం బాలయ్య తన గొర్రెలను పాకలో ఉంచగా, సోమవారం రాత్రి గుర్తుతెలియని కుక్కలు మందపై దాడి చేశాయి. ఈ ఘటనలో ఐదు గొర్రెలు మృతి చెందడంతో బాధిత కుటుంబానికి తీవ్ర నష్టం వాటిల్లింది. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కల కారణంగా ప్రజలు, పశువుల యజమానులు భయాందోళనకు గురవుతున్నారని గ్రామస్థులు తెలిపారు. అధికారులు స్పందించి కుక్కలను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. కుక్కల దాడిలో గొర్రెలను కోల్పోయిన తనను ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందించాలని బాధితుడు జంగం బాలయ్య డిమాండ్ చేశారు.

### ఎమ్మెస్పీ జాతీయ

## సదస్సుకు తరలిన బెజ్జంకి నాయకులు



**బెజ్జంకి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎమ్మెస్పీ ప్రతినిధుల జాతీయ సదస్సుకు బెజ్జంకి మండల ఎమ్మెస్పీ–ఎమ్మార్పీఎస్ నాయకులు బయలుదేరారు. సామాజిక న్యాయం, హక్కుల సాధన, యువత సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి చింతకింది పరశురాములు, అధ్యక్షుడు వడ్లూరి పరశురాములు, మధు, చంద్రం, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంఎస్ఎఫ్ జాతీయ

## సదస్సుకు తరలిన మనోహరాబాద్ నేతలు



**మనోహరాబాద్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సుకు మనోహరాబాద్ మండల విద్యార్థి నాయకులు బయలుదేరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బొజ్జ సైదులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యా వ్యవస్థ, భవిష్యత్ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ మండల ఇన్‌చార్జ్ వర గంటి మురళి మాదిగ, సుధాకర్ మాదిగ, దప్పు కృష్ణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య, రూరల్ సీఐ నయీం, ఎస్సై మధుసూదన్‌రెడ్డి, కానిస్టేబుళ్లు రామకృష్ణ, రాజు, షకీర్, సాయికుమార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న వార్డు సభ్యునికి ఆర్థిక సాయం



**నంగునూరు అక్టోబర్ 6 (జనంసాక్షి):** నంగునూరు మండలం గట్ల మల్యాల గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు బత్తుల కనకయ్య అనారోగ్యంతో బాధపడు తుండటంతో గ్రామనాయకుడు వంగ రాజేశ్వర్ రెడ్డి రూ. 10,000 ఆర్థిక సాయం అంద జేశారు. అలాగే మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్ రెడ్డి రూ. 5,000 అంద జేసి అండగా నిలిచారు. తమను ఆదుకున్న నాయకులకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిప్పని రమేష్, మాజీ ఎంపీటీసీ ఓజల్ పాల్గొన్నారు.

## మునిపల్లి వాసి బండారి మహిపాల్‌కు రాష్ట్రస్థాయి ఫిల్మ్ మేకర్ అవార్డు





**మునిపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** తాను కష్టపడి ప్రతిభ కనబరిచినందుకు గుర్తించి రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిల్మ్ మేకర్ అవార్డుతో సత్కారం పొందారు సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లికి గ్రామానికి చెందిన బండారి మహిపాల్ ఉన్నత విద్యను ఎం.కాం పూర్తి చేసిన అనంతరం తన పెద్దన్న బండారి పాండు వద్ద ఫోటోగ్రఫీ కళను అభ్యసించారు. పాండు అప్పటికే ప్రముఖ ఫోటోగ్రాఫర్ కీర్తిశేషులు కుసుమ ప్రభాకర్ వద్ద శిక్షణ పొందారు. చిన్ననాటి నుంచే అన్న చిత్రీకరించిన ఛాయాచిత్రాలను చూసి ఫోటోగ్రఫీపై ఆసక్తి పెంచుకున్న మహిపాల్, అనంతరం వీడియోగ్రఫీ రంగంలోనూ శిక్షణ పొందారు.

వారి కుటుంబంలో ఫోటోగ్రఫీపై ఉన్న ఆసక్తి క్రమంగా వృత్తిగా మారింది. రెండో సోదరుడు బండారి సుభాష్ సైతం ఈ రంగంలో స్థిరపడి సదాశివపేటలో జయచరణ్ డిజిటల్ స్టూడియోను నిర్వహిస్తున్నారు. సోదరుల స్ఫూర్తితో మహిపాల్ ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా స్వయంగా వ్యాపారాన్ని ప్రారంభించి పలువురు యువతకు ఉపాధి కల్పిస్తున్నారు.

తెలంగాణ జానపద, వివాహ, సినిమాటిక్ చిత్రీకరణల్లో తన ప్రతిభను ప్రదర్శిస్తూ మహిపాల్ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. సోదరులు సదాశివపేటలో స్థిరపడగా, తాను హైదరాబాద్‌లో వీడియోగ్రఫీ రంగంలో కొనసాగుతున్నట్లు తెలిపారు. తనకు ఫోటోగ్రఫీలో తొలి గురువు తన పెద్దన్న బండారి పాండు అని పేర్కొన్నారు. తన ప్రతిభను గుర్తించి ఫోటో పరివార్ ఇండియా నిర్వాహకులు రాష్ట్రస్థాయి ఫిల్మ్ మేకర్ అవార్డు అందించడం ఆనందంగా ఉందని, అందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్, తెలంగాణ ఫోటోగ్రఫీ సంక్షేమ సంఘం కోశాధికారి మునగాల శైలేందర్, రాష్ట్ర ఫోక్ ఫోటోగ్రఫీ సంఘం ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్, ఫోటోటెక్ అభిమన్యురెడ్డి, ఎడిట్ పాయింట్ ఇప్పలపల్లి రమేష్, చారి, కరిపే రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వం

- జ్ఞానేష్ కుమారును పదవి నుండి తొలగించాలి
- సర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలిలి ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలకం
- అర్హుల ఓట్లు తొలగించడం అన్యాయం.. కేంద్రంపై పోరాటం చేస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు
- జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు నిర్మాల జగ్గారెడ్డి
- కలెక్టర్ కార్యాలయం ఎదుట ఇండియా బ్లాక్ పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం





**సంగారెడ్డి అక్టోబర్ 06 (జనంసాక్షి):** ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాడుతామని ఇండియా కూటమి నేతలు హెచ్చరించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే పదవి నుండి తొలగించాలని, ఎస్.ఐ.ఆర్ (SIR) ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, తెలంగాణ జన సమితితో కూడిన ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ఆందోళన నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అయితే బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతూ పరిపాలన సాగిస్తోందని వారు తీవ్రంగా ఆరోపించారు. అర్హులైన పేదల, సామాన్యుల ఓట్లను అన్యాయంగా తొలగించడం ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమేనని మండిపడ్డారు.

ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించకుండా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా పని చేస్తోందని నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ పేరుతో తెలంగాణలో లక్షలాది మంది ఓటర్లకు నోటీసులు జారీ చేస్తూ పెద్ద ఎత్తున పేర్లను తొలగించే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకతను పాటించాలని డిమాండ్ చేశారు.

ఈ నిరసన కార్యక్రమంలో ఇండియా కూటమి నాయకులు, జహీరాబాద్ కాంగ్రెస్ ఇన్చార్జి ఈ. చంద్రశేఖర్, జయరాజు, మల్లేశం, మాణిక్, సాయిలు, యాదగిరి, కూన సంతోష్, కిరణ్, తుల్జా రెడ్డి, అశోక్, రెహమాన్, చిరంజీవి, ఆనంద్, కుమార్, రాంరెడ్డి, వినోద్, సుధాకర్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## సిసిపల్లిలో పేకాట రాయుళ్ల అరెస్ట్...

- నగదు స్వాధీనం

**కోహెడ, అక్టోబర్ 06 (జనంసాక్షి):** మండలంలోని చెంచల్ చెరువుపల్లి గ్రామ శివారులోని మడెలయ్య గుడి సమీపంలో మూడు ముక్కలాట అడుతుండగా కోహెడ పోలీస్ లు పట్టుకొని కేసు నమోదు చేసినారు. అలాగే వారి వద్ద నుండి 7,320 రూపాయలు, కార్డ్స్, రెండు వాహనాలు, మూడు మొబైలు ఫోన్ లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. పట్టుబడిన వారి వివరాలు

ఏ 1 సకినాల మల్లేశం తండ్రి నారాయణ , 46 , కులం పద్మశాలి గ్రామం . చంచల్ చెరువు పల్లి.

ఏ 2. లెంకల రమణ రెడ్డి తండ్రి . రాజి రెడ్డి , వయసు 37, కులం రెడ్డి , రైతు గ్రామం . సీసీ పల్లి.

ఏ 3. చీమలపాటి శ్రీకాంత్ తండ్రి భూమయ్య , వయసు 29 కులం ఆరె , గ్రామం చెంచల్ చెరువు పల్లి , ఏ 4. గొరబోయిన మల్లయ్య తండ్రి . వీరయ్య , వయసు 58, కులం తెనుగు , రైతు గ్రామం . సీసీ పల్లి వీరందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు.ఎంతటి వారైన చట్ట వ్యతిరేక పనులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

## నేడు మండలానికి ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి రాక



**ఉర్కొండ, అక్టోబర్ 06 (జనంసాక్షి);** పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడానికి నేడు మండలానికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి వస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్ పాషా, కాంగ్రెస్ పార్టీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి తెలియజేశారు. మండలంలోని ఊరుకొండ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తారని, అనంతరం ఇప్ప పహాడ్, జకినాలపల్లి, నర్సంపల్లి, గుండ్ల గుంటపల్లి గ్రామలలో నూతనంగా మంజూరైన గ్రామ పంచాయతీ భవనాలకు భూమిపూజ చేస్తారని తెలియజేశారు. మండలానికి ఎమ్మెల్యే పర్యటనను దృష్టిలో పెట్టుకొని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నేతలు,సర్పంచులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలియజేశారు.

## బానాపూర్‌లో దళిత భక్తుడికి ఘనంగా ఆలయ ప్రవేశం

- విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రవేశం..
- సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన ఘటన





**నారాయణఖేడ్, అక్టోబర్ 06 (జనంసాక్షి):** సామాజిక సమానత్వం, కుల వివక్ష నిర్మూలనకు ప్రతీకగా నిలిచే అరుదైన ఘటన నారాయణఖేడ్ మండలం బానాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. విశ్వహిందూ పరిషత్ (VHP) ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన విఠల్ అనే దళిత భక్తుడిని నిర్వాహకులు భుజాలపై ఎక్కించుకుని ఊరేగింపుగా హనుమాన్ మందిరంలోకి తీసుకెళ్లి స్వామివారి దర్శనం కల్పించారు.

కులాతీత సమాజ నిర్మాణం, అందరికీ సమాన గౌరవం అందించాలనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విహెచ్‌పి ప్రతినిధులు డాక్టర్ శంకర్, సాయిరాం, గంగారంలతో పాటు నారాయణఖేడ్ మాల మహానాడు అధ్యక్షుడు విశ్వనాథం ఈ కార్యక్రమంలో పాల్గొని ఆదర్శంగా నిలిచారు.

సమాజంలో కుల వివక్షకు తావులేకుండా ప్రతిఒక్కరూ సోదరభావంతో మెలగాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ సామాజిక సమరసత కార్యక్రమాన్ని గ్రామస్తులు విశేషంగా అభినందించారు.

## చౌటకూర్ నూతన ఎంపీఓగా రాజ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



**చౌట్కూర్, అక్టోబర్ 06 (జనంసాక్షి):** చౌటకూర్ నూతన మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)గా కే.రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. జహీరాబాద్ పరిధిలోని జరాసంగం నుంచి బదిలీపై వచ్చిన ఆయనకు ఎంపీడీఓ కే. శంక౯ర్, పంచాయతీ కార్యదర్శులు బషీర్, శైలజ, వహీద్, యాదగిరి ఘనంగా శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అంతకుముందు ఇక్కడ పని చేసిన ఎంపీఓ గుమ్మడిదలకు బదిలీ అయ్యారు.

## గణపతి లడ్డూను దక్కించుకున్న రిపోర్టర్ నటరాజ్ గౌడ్



**శివ్వంపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):** శివ్వంపేటలో కింగ్స్ యూత్, పిఎంజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో V6 రిపోర్టర్ నటరాజ్ గౌడ్ పాల్గొని, వరుసగా ఐదోసారి లడ్డూను దక్కించుకున్నారు. గణపతి లడ్డూ పొందడం తన అదృష్టమని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు త్రినేష్ గౌడ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## పాముకాటుతో మహిళా మృతి



**ఇటిక్యాల,అక్టోబర్ 6 (జనంసాక్షి):** పాము కాటుకు గురై మహిళ చెందిన సంఘటన మండలంలోని గోపాల్దిన్నె గ్రామంలో చోటుచేస్తుంది. ఏఎస్ఐ సుధాకర్ తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లలితా అలియాస్ మంజుల (33) రోజు మాదిరిగానే సోమవారం వ్యవసాయ పనులకు వెళ్లి పత్తి చేనులో పత్తి ఏ రుతుండగా పాము కాటు వేసింది. దీంతో గమనించిన స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోని మృతి చెందిందన్నారు. మృతురాలికి భర్త గోపాల్ తో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం గద్వాల ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## సింగారంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**నారాయణపేట, ఆక్టోబర్ 6(జనంసాక్షి):** నారాయణపేట మండలం, సింగారం గ్రామం లో మంగళవారం పంచాయతీ కార్యాలయంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చాలా రోజుల తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలతో కూడిన రేషన్ కార్డులు చేతికి అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో మొత్తం 560 కొత్త రేషన్ కార్డుల్లో 350 కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు జిపిఓ విజయకుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ యంపిటిసి నగేష్, మాజీ ఉపసర్పంచ్ బాల్ రెడ్డి, సిద్దప్ప, డీలర్ సుధాకర్ రెడ్డి, చంద్రకాంత్, భగీరథ్, వినోద్ కుమార్, నరేందర్ రెడ్డి, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మంగంపేటలో పెన్షన్ల పరిశీలించిన డిపిఓ



**మల్దకల్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో మంగళవారం సర్పంచ్ వెంకటేష్ అధ్యక్షతన పెన్షన్ల వెరిఫికేషన్ నిర్వహించడం జరిగింది. ఈ వెరిఫికేషన్‌లో భాగంగా డిపిఓ శ్రీకాంత్, ఎంపీఓ జాకీర్, గ్రామ సెక్రెటరీ గాయత్రి,ఉప సర్పంచ్ రామన్న తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తిలో క్రీడా సంబురం..

## 16, 17న జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్

ఏడు క్రీడల్లో పోటీలు: క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, క్యారమ్స్, చెస్, టగ్‌ఆఫ్‌వార్‌లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రధాన క్రీడల్లో ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ, నాలుగో బహుమతులు రూ.5 వేల చొప్పున అందజేయనున్నారు. క్యారమ్స్, చెస్, టగ్‌ఆఫ్‌వార్‌లో ప్రథమ బహుమతి రూ.5 వేలు, ద్వితీయ రూ.3 వేలు, తదుపరి రెండు స్థానాలకు రూ.1,500 చొప్పున అందిస్తారు. అత్యధిక పాయింట్లు సాధించిన జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

క్రీడల్లో యువత చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించడంతో పాటు క్రమశిక్షణ, పోటీతత్వం, జట్టుగా పనిచేసే లక్షణాలను పెంపొందించడమే లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఎస్పీ సునీత రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వర్షంలో విధులకు రక్షణగా రెయిన్‌కోట్స్

• పోలీసు సిబ్బందికి పంపిణీ చేసిన ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 6 (జనంసాక్షి):** వర్షాకాలంలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది సురక్షితంగా విధులు నిర్వర్తించేందుకు రెయిన్‌కోట్లను పంపిణీ చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజల భద్రత కోసం పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. సిబ్బంది ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన రక్షణ సామగ్రిని దశలవారీగా అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా రెయిన్‌కోట్లు, ఉన్ని జాకెట్లు, ఉన్ని దుప్పట్లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించి, మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని, పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అడ్మిన్ సురేష్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ విద్యుత్ వినియోగంపై అధికారుల కొరడా

• జిల్లెల శివారులో గుట్టల బ్లాస్టింగ్..
• అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యుత్ చోరీ



**కల్వకుర్తి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** కల్వకుర్తి మండలంజిల్లెల శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టలను బ్లాస్టింగ్ చేస్తూ గ్రానైట్ రాళ్లను వెలికితీసి విక్రయిస్తున్న ప్రాంతంలో అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న ఘటనను విద్యుత్ అధికారులు గుర్తించారు. అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అక్రమంగా విద్యుత్ సరఫరా తీసుకుంటున్నట్లు గుర్తించిన అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 1,200 మీటర్ల విద్యుత్ వైర్లు, 6 కట్టర్లు, 6 డ్రిల్లింగ్ మిషన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తూ ప్రభుత్వానికి నష్టం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా అధికారి సోమేశ్వర రావు మాట్లాడుతూ..అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.రైతుల వ్యవసాయ అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఇతరులకు విద్యుత్ విక్రయించడం, ఇతర అవసరాలకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమన్నారు.
రైతులకు వ్యవసాయానికి నీటి సౌకర్యం కల్పించేందుకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, వాటిని ఇతర అవసరాలకు వినియోగించకూడదని స్పష్టం చేశారు. ఇక పై ఇలాంటి ఘటనలు పునరావృతమైతే సంబంధిత రైతుల పై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అక్రమ విద్యుత్ వినియోగం పై నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ క్రమంలో ఏడి.శంకర్, ఎఈ.జానకి రామ్, కృష్ణప్రసాద్, నర్సిరెడ్డి ,శ్రీదర్ చారి, శేఖర్, విజందర్, వాల్యా,రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. ఒకరు మృతి

• క్షతగాత్రులను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 06 (జనంసాక్షి):** దొరబాయిమిట్ట సమీపంలో ఆటోను ఆర్టీసీ డీలక్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో కొండ వనజ అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. శేరిపల్లి జములమ్మ దర్శనానికి వెళ్తున్న బేడ, బుడగ జంగాల సామాజిక వర్గానికి చెందిన వారు ప్రయాణిస్తున్న ఆటోను బస్సు ఢీకొట్టింది. గాయపడిన కొండ సుహాసిని, గుగ్గిల నారాయణమ్మతో పాటు చిన్నారులు నంద కిషోర్, అక్షయ, మీనాక్షి, శంకర్ వనపర్తి జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.
విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఓదార్చి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రభుత్వం బాధిత పేద కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# ప్రభుత్వం అందించిన స్కూల్ డ్రెస్సుల పంపిణీ



**గండీడ్, అక్టోబర్,6 (జనంసాక్షి):** గండీడ్ మండలంలోని వెన్నచెడ్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం అందించిన స్కూల్ డ్రెస్సులను విద్యార్థులకు గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్నటువంటి సంక్షేమ పథకాలు, సౌకర్యాలు, విద్యార్థులు వినియోగించుకుని మీయొక్కసాధనను కలలను క్రీడలను గ్రామస్థాయి మండల స్థాయిలో జిల్లా స్థాయి, క్రీడలతోపాటు చదువును కూడా వినియోగించుకోవాలని ఉన్నత శిఖరాలను అధిరోహించితల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ మంజుల, పిఎసిఎస్ డైరెక్టర్ పుష్పలతగోపాల్, స్కూల్ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగండి.. ఆలోచించండి.. ఆ తర్వాతే అడుగు వేయండి!

## సైబర్ మోసాల వలలో పడొద్దు.. అప్రమత్తంగా ఉండండి: ఎస్పీ సునీత రెడ్డి




**వనపర్తి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వనపర్తి జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి సూచించారు. నేషనల్ సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్ మంత్‌లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమె విడుదల చేశారు.
తెలియని ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు, ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్‌లు, అధికారుల పేరుతో మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరికీ వెల్లడించవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేయడంతో పాటు cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సకాలంలో సమాచారం అందిస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అక్టోబర్ నెలలో పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్లు, సూపర్ మార్కెట్లు, ప్రజలు అధికంగా గుమిగూడే ప్రాంతాల్లో విస్తృతంగా సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ, ఐటీ సెల్ ఎస్సై నరేష్, సైబర్ క్రైమ్ ఎస్సై తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల వేతనాలు, సౌకర్యాలపై ఫిర్యాదు..

• అమ్స్రో లైఫ్ సైన్స్‌పై విచారణకు డిమాండ్!




**బాలానగర్, అక్టోబర్ 6(జనంసాక్షి):** బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామంలోని అమ్స్రో లైఫ్ సైన్స్ ప్రైవేట్ కంపెనీలో కార్మికుల సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సామాజిక కార్యకర్త కోస్గి వెంకటయ్య మంగళవారం హైదరాబాద్‌లోని లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలను బ్యాంకు ఖాతాల ద్వారా చెల్లించకుండా నగదు రూపంలో అందిస్తున్నారని వెంకటయ్య ఫిర్యాదులో ఆరోపించారు. దీనివల్ల కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ తదితర చట్టబద్ధమైన సౌకర్యాలు స! క్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా సుమారు 180 మంది కార్మికులు ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు.
కార్మిక చట్టాల ప్రకారం తమకు రావాల్సిన హక్కులు, సౌకర్యాలు కల్పించాలని కోరిన కార్మికులపై యాజమాన్యం ఒత్తిడి తీసుకురావడంతో పాటు ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు కూడా ఫిర్యాదులో ఆరోపించారు. కార్మికుల శ్రమకు తగిన హక్కులు, భద్రత కల్పించకుండా పని చేయిస్తున్నారని, కేంద్ర కార్మిక చట్టాల నిబంధనలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వెంకటయ్య పేర్కొన్నారు. అదేవిధంగా కంపెనీ పేరు మహబూబ్‌నగర్ జిల్లా లేబర్ కార్యాలయంలో ఇప్పటివరకు నమోదు కాలేదని ఆయన ఆరోపించారు. ఈ అంశాలన్నింటిపై కార్మికశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.
కార్మికుల సమస్యలను పరిశీలించి, వారికి చట్టపరంగా అందాల్సిన వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ తదితర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని లేబర్ కమిషనర్‌ను వెంకటయ్య కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు విచారణలో తేలితే సంబంధిత కంపెనీ యాజమాన్యంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# సర్పంచ్ సురేష్ రెడ్డికి నివాళులర్పించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

• కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, అక్టోబర్ 06 (జనంసాక్షి):** కొత్తకోట మండలం విలియంకొండ గ్రామ బీఆర్ఎస్ సర్పంచ్ మృతిపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన సర్పంచ్ ఎం. సురేష్ రెడ్డి వారం రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం సురేష్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సురేష్ రెడ్డి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి తన అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పెంట్లవెల్లి కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎర్ర శ్రీనివాసులు



**పెంట్లవెల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** పెంట్లవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా అవుట ఎర్ర శ్రీనివాసులు నియమితులయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంకేశ్వరం నిరంజన్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు.
తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు జిల్లా, మండల నాయకులకు శ్రీనివాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

- **కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల నడిగడ్డ, అక్టోబర్ 6(జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్‌లో నీతి ఆయోగ్ ఆధ్వర్యంలోని ప్రోగ్రామ్ కింద ఒక 'ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో' పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 14, 2026 సాయంత్రం 5:00 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ఈ పోస్టుకు 23 నుంచి 38 సంవత్సరాల వయస్సు ఉండి, ఏదైనా విభాగంలో ఫస్ట్ క్లాస్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వారు అర్హులు. డేటా విశ్లేషణ, ప్రెజెంటేషన్, కంప్యూటర్/ఐటీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్ నైపుణ్యాలతో పాటు స్థానిక భాషపై అవగాహన ఉండాలి. ఎంపికైన ఫెలోకు నెలకు రూ. 55,000 స్టైపెండ్‌తో పాటు రూ. 5,000 వరకు ప్రయాణ భత్యం అందజేస్తారు. ఎంపిక ప్రక్రియ మొత్తం 100 మార్కులకు రైటింగ్ స్కిల్, పిపిటి, డేటా విశ్లేషణ, కంప్యూటర్ టెస్ట్ మరియు ఇంటర్వ్యూ ద్వారా జరుగుతుంది.
అర్హత కలిగిన అభ్యర్థులు అవసరమైన ధ్రువపత్రాల స్వీయ ధృవీకరించిన ప్రతులు (Self-attested copies) మరియు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో "అప్లికేషన్ ఫర్ ది పోస్ట్ ఆఫ్ ఆస్పిరేషనల్ బ్లాక్ ఫెలో" అని సీల్డ్ కవర్‌పై రాసి, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రిజిస్టర్డ్ లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా పంపాల్సి ఉంటుంది.
ఎంపికైన వారు గట్టు బ్లాక్‌లో అభివృద్ధి కార్యక్రమాల అమలు, డేటా సేకరణ, ఏబీపీ పోర్టల్ నిర్వహణ మరియు నివేదికల తయారీ వంటి విధులను నిర్వహించాల్సి ఉంటుంది.

# వ్యవసాయ భూముల మీదుగానే కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ అలైన్మెంట్ చేపట్టాలి

- **నివాస ప్రాంతాల గుండా అలైన్మెంట్ వద్దు..**
- **ఇళ్లకు నష్టం కలగకుండా చూడాలి**

**మద్దూరు, అక్టోబర్ 6 (జనంసాక్షి):** కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రతిపాదిత అలైన్మెంట్‌ను నివాస ప్రాంతాలు, ఇళ్లకు నష్టం కలగకుండా, సాధ్యమైనంత మేరకు వ్యవసాయ భూముల మీదుగా చేపట్టాలని మద్దూర్ మండలం దామగన్‌పూర్ గ్రామస్థులు అధికారులను కోరారు. ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగు పడటాన్ని స్వాగతిస్తున్నామని, అయితే అలైన్మెంట్ కారణంగా ప్రజల నివాసాలు, స్థిరాస్తులకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.
ప్రస్తుత అలైన్మెంట్ నివాస ప్రాంతాల గుండా వెళ్తే అనేక కుటుంబాలు ఇళ్లను కోల్పోయి, పునరావాసం మరియు జీవనోపాధి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం సాగునీరు అందించడమే కాబట్టి, ఇళ్లను పూర్తిగా తప్పించి వ్యవసాయ భూముల మీదుగా సాంకేతికంగా సాధ్యమయ్యే అలైన్మెంట్‌ను రూపొందించాలని కోరారు.
ఈ విషయమై సెప్టెంబర్ 18, 2026న మద్దూర్ తహసీల్దార్, నారాయణపేట ఆర్డీఓలకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. తాము ప్రాజెక్టుకు వ్యతిరేకం కాదని, అభివృద్ధి పనుల వల్ల ఏ ఒక్క కుటుంబం నివాసాన్ని కోల్పోకూడదనేదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. తుది నిర్ణయం తీసుకునే ముందు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థుల సమక్షంలో సమస్యను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



# సొంత నిధులతో రోడ్డు వేయించిన ఉప్పరి లక్ష్మణ్ సాగర్



**నారాయణఖేడ్, అక్టోబర్ 06 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం సంజీవరావు పేట గ్రామంలోని 'తోట చివరి కాలనీ' వాసుల రహదారి కష్టాలను చూసి గ్రామానికి చెందిన ఉప్పరి లక్ష్మణ్ సాగర్ స్పందించారు. చాలాకాలంగా సరైన రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో బురదమయంగా మారి రాకపోకలకు కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరాశలో ఉన్న కాలనీవాసులకు లక్ష్మణ్ సాగర్ అండగా నిలిచారు.
తన సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట నూతనంగా రహదారిని వేయించారు. దీంతో ఏళ్ల నాటి సమస్య తీరడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజా సమస్యపై స్పందించి, సేవా దృక్పథంతో సొంత ఖర్చులతో రోడ్డు వేయించిన ఉప్పరి లక్ష్మణ్ సాగర్‌ను గ్రామానికి చెందిన విద్యావేత్తలు, పెద్దలు, కాలనీవాసులు ప్రత్యేకంగా అభినందించారు.

# దోమలపై యుద్ధం.. వ్యాధులకు చెక్

- **డ్రై డేతో దోమల లార్వాకు అడ్డుకట్ట**
- **మలేరియా, డెంగ్యూ నివారణకు ప్రజల భాగస్వామ్యం అవసరం**



**గుండుమాల్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు పాటించాలని గుండుమాల్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సూచించారు. మంగళవారం గుండుమాల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలతో దోమల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రై డే పాటించడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. ఇళ్లలో, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, కూలర్లు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర పాత్రల్లో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. దోమల లార్వా పెరగకుండా నీటి నిల్వలను పరిశీలిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే దోమల నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి కుటుంబం వారానికి ఒకరోజు డ్రై డేగా పాటించి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో డా సౌందర్య, సూపర్ వైసర్స్,మనిమాల,రవికుమార్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

# ముందంజకు ఉపాధ్యాయుడి కృషి



**పాపన్నపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):** విద్యార్థులు క్రీడ పోటీల్లో ముందుకు సాగేలా ప్రోత్సహిస్తున్న కుర్తివాడ జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్‌ను గ్రామ సర్పంచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ రమేష్ గౌడ్ ఘనంగా సన్మానించారు. విద్యార్థుల క్రీడా సామాగ్రి కొనుగోలుకు రూ. 10.000 ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల నిర్వహించిన ఎస్జీఫ్ క్రీడల్లో పాఠశాల విద్యార్థులు వాలీబాల్,ఖోఖో విభాగాల్లో ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయికీ ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు,ఏఏపీ చైర్‌పర్సన్ సౌందర్య,ఉపసర్పంచ్ అనిల్ తదితరులు ఉన్నారు.

# ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామ మహిళా సమైక్య భవనం



**మల్దకల్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** జోగులంబ గద్వాల్ జిల్లా మల్దకల్ మండలం అమరవాయి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామం మహిళా సమైక్య భవనం ప్రారంభానికి సిద్ధమైంది. మహిళా సంఘం సభ్యులు ప్రతినెల సమావేశాలు నిర్వహించుకోవడానికి ప్రతి గ్రామంలో మహిళా సమైక్య భవనాలు నిర్మించారు. మంచి ముహూర్తం కోసం నాయకులు గద్వాల ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభం చేస్తున్నట్లు తెలిపారు.మండలంలోని అన్ని గ్రామాల్లో సమైక్యభవనాలు నిర్మిస్తున్నారు. ఈ నెలలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తుంది.

# పైతరలో ఉచిత వైద్య శిబిరం ప్రారంభం



**కొల్చారం, అక్టోబర్ 06 (జనంసాక్షి):** కొల్చారం మండలం పైతర గ్రామంలో సింధు హాస్పిటల్ సౌజన్యంతో సర్పంచ్ రవితేజ రెడ్డి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మార్కెటింగ్ మేనేజర్ విజయ్ కుమార్ పర్యవేక్షణలో గైనకాలజీ, షుగర్, బిపి, గుండె, క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రవితేజ రెడ్డితో సహా 200 మంది గ్రామీణులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుధాకర్, చాగంటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కుంటలో మునిగి యువకుడు మృతి



**నార్సింగి, అక్టోబర్ 06 (జనంసాక్షి):** గొర్రెలను కడిగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో మునిగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన నార్సింగి మండలంలో చోటుచేసుకుంది. పెద్ద తండాకు చెందిన మాలోత్ నవీన్ (22) ఖాసులాపూర్ పరిధిలోని లింగారెడ్డి కుంటలో ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని రామాయంపేట ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ ఖాజా మిస్బాహ్ ఉద్దీన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 15 రోజుల తర్వాత బాలుడి ఆచూకీ

- **మిస్సింగ్ కేసు సుఖాంతం**



**సంగారెడ్డి బ్యూరో అక్టోబర్ 6 (జనంసాక్షి):** కంది మండలం కోయగుండు తండాకు చెందిన 15 ఏళ్ల బాలుడు ప్రదీప్ రాజ్ మిస్సింగ్ కేసు సుఖాంతమైంది. ఈ నెల 21న పాఠశాలకు వెళ్తున్న క్రమంలో అదృశ్యమైన బాలుడి కోసం పోలీసులు 15 రోజుల పాటు విస్తృతంగా గాలింపు చేపట్టారు. సంగారెడ్డిలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ప్రదీప్ రాజ్ అదృశ్యమైన విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ కేసును స్వయంగా పర్యవేక్షించారు. ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని భరత్‌నగర్ రైల్వే స్టేషన్ వద్ద బాలుడి ఆచూకీని గుర్తించి సురక్షితంగా తీసుకొచ్చారు. తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు బాలుడు పోలీసులకు తెలిపినట్లు సమాచారం. కుమారుడి ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

# మైసంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు షూలు , బెల్టుల పంపిణీ



**నంగునూరు, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో నంగునూరు మండల పరిధిలోని మైసంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి ఉచితంగా బూట్లు, బెల్టులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రయోజనాలకు గ్రామ సర్పంచ్‌గా తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉప సర్పంచ్ కనకవ్వ మల్లేష్, వార్డు సభ్యులు తేలు రవి, పెల్లి శిరీష నాగరాజు, గ్రామ యువకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే మా లక్ష్యం

- 500 మంది సభ్యులతో గత ఐదు సంవత్సరాలుగా అద్దె భవనంలో సేవలు
- సంగాయిపేట సహకార సంఘానికి రూ.50 లక్షలు మంజూరు చేయాలి



**కొల్చారం, అక్టోబర్ 06 (జనంసాక్షి):** కొల్చారం మండలం సంగాయిపేట గ్రామంలోని మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘానికి సొంత భవన నిర్మాణం కోసం రూ.50 లక్షల నిధులు మంజూరు చేయాలని సంఘం ప్రతినిధులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. సంఘంలో సుమారు 500 మంది సభ్యులు ఉన్నారని, గత ఐదేళ్లుగా అద్దె భవనంలోనే రైతులకు సేవలు అందిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో అద్దె భవనం కారణంగా రైతులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంఘానికి సొంత స్థలం ఉన్నందున నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్సీ షేరి సుభాష్ రెడ్డి, మంజీరా వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, సిడిసి మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి ఉన్నారు.

## ఉపాధ్యాయులు గైర్హాజరైతే చర్యలు తప్పవు

కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, సీహెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలు, పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై సమీక్షించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..**

జిల్లాలోని ఎఫ్ఎల్ఎన్ (ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం) కాంపిటెంట్ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి బోధన, ఉపాధ్యాయులు--విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరును ముఖ గుర్తింపు విధానం ద్వారా క్రమం తప్పకుండా నమోదు చేయాలని, దానికి సంబంధించిన రోజువారీ నివేదికను సమర్పించాలన్నారు.

పాఠశాలలకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే సోమవారం నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు స్పష్టంగా ఉండాలని, హాజరు నమోదులో ఎలాంటి అవకతవకలు, నిర్లక్ష్యం ఉండకూడదన్నారు.

ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల ద్వారా ప్రతి విద్యార్థి తన తరగతి స్థాయికి అనుగుణంగా చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయులను ఎప్పటికప్పుడు అంచనా వేసి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

పాఠశాలల పనితీరు, విద్యార్థుల అభ్యసన ఫలితాలను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చోట తక్షణమే మెరుగుదల చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఎంఈఓలు, సీహెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

సమావేశంలో జిల్లా విద్యాధికారి రోహిణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు, ఎంఈఓలు, సీహెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్

- దామరగిద్ద కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 6 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల/కళాశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సందర్శించి మౌలిక వసతులు, విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు గదుల భవనాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డీఈఓ గోవిందరాజులను ఫోన్ ద్వారా ఆదేశించారు. నూతన భవనంలోని కింది అంతస్తు గదులను తరగతుల నిర్వహణకు వినియోగించుకోవాలని ఎస్ఓ స్వాతికి సూచించారు.

అనంతరం ఇంటర్మీడియట్ మరియు వొకేషనల్ విద్యార్థినులతో మాట్లాడి వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు లా, నర్సింగ్ చదవాలనే ఆసక్తిని వ్యక్తం చేయగా, కలెక్టర్ వారిని అభినందిస్తూ పట్టుదలతో చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని మెస్ కమిటీని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ నిల్వలను, మెనూ బోర్డును తనిఖీ చేశారు. పాఠశాలలోని పనిచేయని ఆర్వో ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని, అవసరమైతే కొత్త ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. డైనింగ్



షెడ్‌లోకి పక్షులు రాకుండా షెడ్ ఎత్తును పెంచేందుకు నిర్మాణ పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు శుభ్రమైన పౌష్టికాహారం అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ముద్ద చర్మ వ్యాధి నివారణకు పశువులకు టీకాలు..



**చిన్నశంకరంపేట, అక్టోబర్ 06 (జనంసాక్షి):** ముద్ద చర్మ వ్యాధి (లంపీ స్కిన్ డిసీజ్) నివారణకు రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశువైద్యాధికారి గీతా మాలిక సూచించారు. మంగళవారం మండలంలోని చందంపేట గ్రామంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుపు రంగు జాతికి చెందిన ఆవులు, ఎద్దులకు పశువైద్య సిబ్బంది టీకాలు వేశారు. వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా పశువులకు లంపీ చర్మ వ్యాధి సోకే అవకాశం ఉందని గీతా మాలిక తెలిపారు. పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప పశువైద్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్, ఉపసర్పంచ్ నరసింహులు, పాలకవర్గ సభ్యులు రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## రేగులపల్లిలో ఘనంగా పౌష్టికాహార మాసోత్సవాలు



**బెజ్జంకి,అక్టోబర్ 6 (జనంసాక్షి):** బెజ్జంకి మండలం రేగులపల్లి రెండవ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ జంగిలి లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై గర్భిణులు, బాలింతలకు 'ఆరోగ్యలక్ష్మి' ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్ లావణ్య సమతుల్య ఆహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శోభారాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యం

**బిజెపి మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్**



**చేర్యాల, అక్టోబర్ 06 (జనంసాక్షి):** రాబోయే ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని బీజేపీ చేర్యాల మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం చేర్యాల పట్టణంలోని వాసవి గార్డెన్‌లో మండల స్థాయి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 7వ తేదీన ఉదయం 9:30 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజాసేవ, వికసిత్ భారత్ సంకల్పంలో భాగంగా 'సేవా జ్యోతి యాత్ర - వికసిత్ భారత్ సంకల్ప సభ' నిర్వహిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమా నికి బూత్ స్థాయి నుండి మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్ర మహేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కాశెట్టి పాండు, జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నె సత్యవర్ధన్, సీని యర్ నాయకులు ముష్కీర్ నరసింహులు గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు, కొట్టే చంద్రమౌళి, రవీందర్ రెడ్డి, చల్ల బాల్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కూరపాటి నరసింహులు, గుంటి రాములు, మారబోయి న మహేష్, ఆవుచర్ల రవి, గట్టోజు వేణు, పండుగ రాజు, సతీష్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు



**సంగారెడ్డి, అక్టోబర్ 6(జనంసాక్షి):** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జోగిపేట్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) పేర్కొన్నారు. మంగళవారం ఐసిడిఎస్ జోగిపేట్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. 16వ వార్డులోని అవుసలి సంఘం. భవనంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తుందన్నారు. అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న చిన్నారులకు ఆరోగ్యకరమైన భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, 16వ వార్డు కౌన్సిలర్ పట్లోల శ్రీనివాస్, ఐసీడీఎస్ సీడీపీఓ మధులత, మెప్మా టీఎంసీ బిక్షపతి గౌడ్ హాజరయ్యారు. ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.



## రాజోళి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి: సీపీఎం



**రాజోళి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** వర్షాలు లేక పంటలు ఎండిపోయి, పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు తీవ్ర నష్టాల్లో ఉన్నారని, వెంటనే రాజోళి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్.విజయకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం రాజోళి మండల కేంద్రంలో రైతుల పంట పొలాలను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎకరాకు రూ. 60 వేల వరకు పెట్టుబడి పెట్టి పురుగుల మందులు పిచికారీ చేసినా, వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయాయని రైతులు తలారి చంద్రన్న, పింజారి హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రెండు క్వింటాళ్ల పత్తి కూడా దిగుబడి రావడం లేదని, రెండో పంట వేసే అవకాశం కూడా కనిపించడం లేదని వాపోయారు. తుంగభద్ర నది సమీపంలోనే ఉన్నప్పటికీ సాగునీరు అందడం లేదని విజయకుమార్ విమర్శించారు.

నియోజకవర్గ ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే రాజోళిని కరువు మండలంగా ప్రకటించి, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30వేల పరిహారం చెల్లించాలని సీపీఎం తరఫున డిమాండ్ చేశారు.

# రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

• అదనపు కలెక్టర్ వినోద్ కుమార్

**శ్రీరంగాపూర్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కాంచీరావుపల్లి రైతు వేదికలో పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల (పీపీసీ) ఇన్‌ఛార్జులకు నిర్వహించిన ముందస్తు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాలకు తెచ్చే ధాన్యాన్ని నిబంధనల ప్రకారం పరిశీలించి, మద్దతు ధర అందేలా చూడాలని సూచించారు. తేమ శాతం నిర్ధారణ, తూకం, గన్నీ బ్యాగులు, రవాణా ఏర్పాట్లలో జాప్యం లేకుండా ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. రైతులు వేచి చూడాల్సిన అవసరం లేకుండా ట్యాబ్‌లలో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి రశీదులు జారీ చేయాలని ఆదేశించారు.



**భూ రీ-సర్వే పనులు పకడ్బందీగా నిర్వహించాలి...**

అనంతరం శ్రీరంగాపూర్ మండలం నాగసానిపల్లి గ్రామంలో సాగుతున్న భూ సమగ్ర రీ-సర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా రైతుల సమక్షంలోనే కొలతలు నిర్వహించి, సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించాలని సూచించారు. నిర్దేశిత సమయంలో సర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, వ్యవసాయ, సర్వే విభాగాలు మరియు కొనుగోలు కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి: సిపిఐ (ఎం-ఎల్) మాస్ లైన్ డిమాండ్

• నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలి
• విద్యుత్ కోతలను నివారించాలి
• రైతు రుణమాఫీ అమలు చేయండి

**అమరచింత, అక్టోబర్ 6 (జనంసాక్షి):** CPI (ML) మాస్ లైన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అమరచింత మండల తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, విద్యుత్ కోతలను నివారించాలని మరియు రైతు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సి. హనుమంతు, నాయకులు కె. రాజన్న, సి. రాజు, ఎస్. మాస్తామని మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు 57 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇస్తామని, పింఛను మొత్తాన్ని రూ. 4,000కు పెంచుతామని ఇచ్చిన హామీని నేటికీ నెరవేర్చలేదని విమర్శించారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, బీడీ కార్మికులు మరియు ఒంటరి మహిళలకు వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేయాలన్నారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, కనీస వేతనాలు లేక కష్టజీవులు జీవించడం భారంగా మారిందని, ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు.

వర్షాభావం మరియు ఎండల తీవ్రత వల్ల పంటలు ఎండిపోయి రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయారని, ప్రభుత్వం ఎకరాకు పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు.



కరెంటు కోతల వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, వెంటనే అప్రకటిత విద్యుత్ కోతలను నివారించి, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రైతు రుణాన్ని వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కురుమన్న, ప్రేమరత్నం, మురళి, విజయ్, వరప్రసాద్, కురుమయ్య, సువార్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

• కృష్ణ ఎస్ఐ నవీద్
• రూ.1.40 లక్షలతో 06 సీసీ కెమెరాల ఏర్పాటు



**కృష్ణ, అక్టోబర్ 6 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం రూ. 1.40 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 6 అధునాతన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఎస్ఐ నవీద్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ బాలరాజు, ఉపసర్పంచ్ వెంకటేష్ మరియు గ్రామ పెద్దల సహకారంతో ఈ కెమెరాలను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ నవీద్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రధాన రహదారులు, ముఖ్యాంశ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. నేరాల అదుపునకు, నిందితులను త్వరగా గుర్తించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. 'నేను సైతం - నా గ్రామ భద్రత కోసం సీసీ కెమెరా' అనే భావనతో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సురేందర్ బాబు, విపిఓ, గ్రామ పెద్దలు తిమ్మప్ప, రాఘవేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దిపేట జిల్లా రెడ్డి జాగృతి ప్రధాన కార్యదర్శిగా సంపత్ రెడ్డి



**నంగునూరు, అక్టోబర్ 6 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా రెడ్డి జాగృతి ప్రధాన కార్యదర్శిగా నంగునూరు మండలం నాగరాజుపల్లికి చెందిన జక్కిరెడ్డి సంపత్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు బుట్టెంగారి మాధవరెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడికి సంపత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - ఈ బాధ్యతను ఒక పదవిగా కాకుండా సమాజ సేవకు లభించిన అవకాశంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సంస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.

# శిలాఫలకాల ధ్వంసంపై మక్తల్‌లో బీఆర్ఎస్ నిరసన

**మక్తల్, అక్టోబర్ 06 (జనంసాక్షి):** మక్తల్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ధ్వంసం చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేవలం శిలాఫలకాలను ధ్వంసం చేసినంత మాత్రాన బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజల గుండెల నుంచి చెరిపివేయలేరని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహ గౌడ్, మాజీ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్న హనుమంతు, మాజీ కౌన్సిలర్లు అన్వర్, జగ్గలి రాములు, ఎరుకలి మొగిలప్ప తీవ్రంగా మండిపడ్డారు.





స్థానిక పెద్ద చెరువు కట్టపై 2023వ సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన వెల్‌కమ్ బోర్డు మరియు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. మక్తల్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇటువంటి విద్వేషకర సంస్కృతి పెరుగుతోందని నాయకులు ఆరోపించారు. రెండు నెలల క్రితం రహిమానా కాలనీలో కూడా ఇదే రీతిలో శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని గుర్తుచేస్తూ, ఇవి ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న రాజకీయ కక్షసాధింపు చర్యలని దుయ్యబట్టారు.

ఈ దుశ్చర్యపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో, మున్సిపల్ కమిషనర్, జిల్లా ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అంతకుముందు నాయకులు పెద్ద చెరువు కట్ట వద్ద ధ్వంసమైన శిలాఫలకాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రావణ్ కుమార్, గవినోళ్ల నరసింహా రెడ్డి, శివారెడ్డి, ఈశ్వర్ యాదవ్, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండుమల్ భద్రతకు.. లక్ష చేయూత

• సీసీ కెమెరాల ఏర్పాటుకు అంజి యాదవ్ రూ.లక్ష విరాళం

**గుండుమల్, అక్టోబర్ 5 (జనంసాక్షి):** గుండుమల్ మండల కేంద్రంలో ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఏకే ఫౌండేషన్, ఏకే బిల్డర్స్ చైర్మన్ అంజి యాదవ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాపారులు, యువత, ప్రజాప్రతినిధులు, ప్రజలు తమవంతు సహకారం అందించాలని కోరారు.

**విరాళాలకు పిలుపు...** సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి. "మన భద్రతను మనమే కాపాడుకుందాం.. సురక్షిత గుండుమల్‌ను నిర్మిద్దాం" అని అంజి యాదవ్ పిలుపునిచ్చారు.

## శివ్వంపేటను కరువు మండలంగా ప్రకటించాలి

• నిరంతర విద్యుత్ ఇవ్వాలి
• రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైసయ్య యాదవ్



**శివ్వంపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):** మెదక్ జిల్లాలో వర్షాలు లేక, కరెంటు కోతల వల్ల వరి పంటలు ఎండిపోతున్నాయని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు అక్కమొల్ల మైసయ్య యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది రూపాయల పెట్టుబడి పెట్టిన రైతులు ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు పడక పూర్తిగా బోర్లపైనే ఆధారపడ్డారని తెలిపారు. రోజుకు 5-6 సార్లు విద్యుత్ కోతలు విధిస్తుండటంతో పంటలకు నీరందక ఎండి పోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించి నిరంతర విద్యుత్ అందించేలా అధికారులను ఆదేశించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేస్తారని హెచ్చరించారు. సరైన సాగు లేనందున శివ్వంపేటను ప్రభుత్వం వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని మైసయ్య యాదవ్ కోరారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



**గద్వాల, అక్టోబర్ 10 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 4వ తేదీన గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో వీరు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ అవకాశాన్ని దక్కించుకున్నారు. ముఖ్యంగా అండర్-10, అండర్-12, మరియు అండర్-14 విభాగాల్లో నిర్వహించిన పరుగు పందె రన్నింగ్ పోటీల్లో ఈ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

## గ్యారంటీ లేనిదే ధాన్యం కేటాయింపు లేదు!

**నిబంధనలు పాటించాల్సిందే**

ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించే మిల్లర్లకు అవసరమైన సహకారం అందిస్తామని, అయితే నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి మినహాయింపులు ఉండవని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం కేటాయింపులు, మిల్లింగ్, అన్లోడింగ్ ప్రక్రియలో అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి సీజన్‌ను సజావుగా పూర్తి చేయాలని సూచించారు.

**మిల్లర్ల సమస్యలపై చర్యలు**

గోడౌన్ల వద్ద ధాన్యం అన్లోడింగ్‌లో జాప్యం, మిల్లింగ్ ఛార్జీలకు సంబంధించిన సమస్యలను మిల్లర్లు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ హరీష్, పౌరసరఫరాల శాఖ అధికారి ఆంజనేయులు, సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- మొక్కలు నాటడమే కాదు.. అవి ఎదిగే వరకు సంరక్షించాలి
- భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలి: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**రామాయంపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):** పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ కు బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. రామాయంపేట పట్టణంలో సేవ సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కళ్యాణ శుభ వేదిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘు నందన్ రావుతో కలిసి జీడిమామిడి మొక్కలను నాటారు. పర్యావరణ సమతుల్యత ను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

**జీడిమామిడి సాగుతో రైతులకు అదనపు ఆదాయం...**

జీడిమామిడి వంటి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు, దీర్ఘకాలిక ఆదాయం లభించే అవకాశం ఉందని గవర్నర్ తెలిపారు. జీడిమామిడి తోటల పెంపకం రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహద పడుతుందని అన్నారు.





**మొక్కల సంరక్షణే అసలు లక్ష్యం...**

మొక్కలు నాటడమే కాకుండా అవి ఎదిగే వరకు సంరక్షించినప్పుడే కార్యక్రమం యొక్క అసలు లక్ష్యం నెరవేరుతుందని శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. మానవ జీవితం ప్రకృతిపైనే ఆధారపడి ఉందని, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన గవర్నర్‌కు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులతో పాటు మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు, పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంజక్షన్ చేసిన వెంటనే మహిళ మృతి..

- బంధువుల ఆందోళన



**మద్దూరు/కొత్తపల్లి అక్టోబర్ 6 (జనం సాక్షి):** మద్దూరు పట్టణ కేంద్రంలో ఓ ఆర్ఎంపీ వద్ద చికిత్స కోసం వెళ్లిన మహిళ ఇంజక్షన్ చేసిన కొద్దిసేపటికే మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. నిడ్జింత గ్రామానికి చెందిన ఇటిక్యాల సాయమ్మ (43), భర్త మొగు లప్ప, జ్వరంతో బాధపడుతూ చికిత్సకోసం పట్టణంలోని 'తాజ్' అనే ఆర్ఎంపీ వద్దకు వచ్చినట్లు ఆమె బంధువులు తెలిపారు. చికిత్సలో భాగంగా ఇంజక్షన్ చేసిన అనంతరం కొద్దిసేపటికే సాయమ్మ అస్వస్థత కు గురై మృతి చెందినట్లు బంధువులు పేర్కొన్నారు. దీంతో వెంటనే ఆమెను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలిపారు. ఈ ఘటనతో మృతురాలి బంధువులు ఆందోళనకు దిగారు. ఇంజక్షన్ కార ణంగానే మృతి చెందిందా, లేక ఇతర కారణాల వల్ల జరిగిందా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు.

## అర్హులైన లబ్ధిదారులకే పెన్షన్లు అందాలి

- అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్



**రేవల్లి, అక్టోబర్ 06 (జనంసాక్షి):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా వెరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రేవల్లి మండలంలోని తల్పునూరు, రేవల్లి గ్రామాల్లో 'చేయూత' పెన్షన్ దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అర్హులైన వారికి పథకం ఫలాలు అందిస్తూనే, అనర్హులను క్షేత్రస్థాయిలో గుర్తించి నిబంధనల ప్రకారం తొలగించాలని స్పష్టం చేశారు.

అనంతరం రేవల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ని సందర్శించి ఓపీ, ఐపీ, ఫార్మసీ విభాగాలు, వైద్య సేవలను పరిశీలించారు. డెంగ్యూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ, ప్రజా అవగాహన సదస్సులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీవీ సరోజ, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శివాయిపల్లి సర్పంచ్ భర్తకు రూ. 10,500 జరిమానా!



**పెద్దశంకరంపేట అక్టోబర్ 6. (జనంసాక్షి):** మెదక్ జిల్లా పెద్దశంకరం పేట మండల పరిధిలోని శివాయిపల్లి గ్రామంలో పచ్చని చెట్లను నరికివేసిన ఘటనపై అటవీ శాఖ అధికారు లు కొరడా ఝుళిపించా రు. గ్రామంలోని రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నరికివేసిన దుకు గాను, గ్రామ సర్పంచ్ భర్త నరేష్ రూ. 10,500 జరిమానా విధించినట్లు అటవీ అధికారి హిమచందన ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగ లకు అడ్డు వస్తున్నాయన్న నెపంతో కొద్దిరోజుల క్రితం కొమ్మలకు బదులుగా ఏకంగా చెట్లనే పూర్తిగా నరికివేసిన విషయం తెలిసిందే. దీనిపై స్థానికుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడం తో స్పందించిన అటవీ శాఖ విచారణ చేపట్టింది. విచారణలో అనుమతు లు లేకుండానే చెట్లను నరికినట్లు తేలడంతో అటవీ శాఖ నిబంధనల ప్రకారం జరిమానా విధించారు. పర్యావరణానికి హాని కలిగిస్తూ, కనీస అనుమతులు లేకుండా పచ్చని చెట్లను నరికివేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని అటవీ అధికారి ఈ సందర్భంగా హెచ్చరించారు.

# కొల్లంపల్లిలో 552వ ఉర్సు షరీఫ్ వేడుకలు

- పోస్టర్లు ఆవిష్కరించిన ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట,జిల్లా బ్యూరో అక్టోబర్ 6 (జనం సాక్షి):** నారాయణపేట జిల్లా కొల్లంపల్లిలో నిర్వ హించనున్న హజ్రత్ మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా అహ్మద్ ఖత్తాల్ హుస్సేనీ అష్రఫీ జలాలీ (రహ.) 552వ వార్షిక ఉర్సు షరీఫ్ పోస్టర్లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆవిష్కరించారు.

ఈ వేడుకల్లో భాగంగా అక్టోబర్ 16న దర్గా షరీఫ్ ప్రాంగణంలో 26వ అంతర్మత సదస్సు నిర్వహించ నున్నట్లు అష్రఫియా ఎద్యుకేషనల్ సొసైటీ ఉపాధ్య క్షులు అడ్వకేట్ అబ్దుల్ సలీం తెలిపారు. గోగీ షరీఫ్ సజ్జాదానషీన్ సయ్యద్ షా కలీముల్లాహ్ హుస్సేనీ అధ్యక్షతన జరిగే ఈ సదస్సుకు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, ఎమ్మె ల్సీ నవీన్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్‌లతో పాటు పలువురు మఠాధిపతులు, హిందూ-ముస్లిం మత పెద్దలు హాజరుకానున్నారు. అక్టోబర్ 16న అసర్ నమాజ్ తర్వాత జలాలియా పతాకావిష్కరణ (రస్మ్-ఎ-పర్చమ్ కుషాయీ), మగ్రిబ్ నమాజ్ అనంతరం లంగర్ ఖత్తాలియా నిర్వహించనున్నారు. అక్టోబర్ 17న ఫజర్ నమాజ్ తర్వాత ఖానఖ్వాహ్ నుంచి సందల్ ఊరేగింపు ప్రారంభమై దర్గాకు చేరుకుంటుంది. సజ్జాదానషీన్ మఖ్దూమ్ ఖ్వాజా సయ్యద్ షా జలాల్ హుస్సేనీ చేతుల మీదుగా రస్మ్-ఎ-సందల్, ఇషా నమాజ్ తర్వాత చిరాగాన్, మహ్ఫిల్-ఎ-సమా వేడుకలు జరుగుతాయి. అక్టోబర్ 18న ఉదయం 8 గంటలకు



మహ్ఫిల్-ఎ-కుల్ మరియు తబర్రుకాత్ పంపిణీతో ఉర్సు వేడుకలు ముగుస్తాయి.

ఈ ఉర్సు షరీఫ్ వేడుకల్లో హిందూ, ముస్లిం సోద రులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ అమీరుద్దీన్, మున్సిపల్ కౌన్సిలర్ తఖీ చాంద్, దస్తగీర్ చాంద్, ఆరిఫ్ ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్--గంగాపూర్ రహదారి అధ్వానం..

**దుమ్ముతో ఇబ్బందులు**

కంకర పరిచిన రహదారిపై వాహనాలు వెళ్లే సమయంలో పెద్ద ఎత్తున దుమ్ము లేస్తోంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించకపోవడంతో ప్రమాదాలకు అవకాశం ఏర్పడుతోంది. రహదారి పక్కన నివసించే ప్రజలు కూడా దుమ్ము కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు దుమ్ము వల్ల ఇబ్బంది పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పనులు వేగవంతం చేయాలని డిమాండ్**

రహదారి పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కంకర పరిచిన ప్రాంతంలో త్వరితగతిన బీటీ పనులు పూర్తి చేసి రహదారిని ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పనుల్లో జాప్యం చేయకుండా నాణ్యతా ప్రమాణాలతో రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని కోరుతున్నారు.

బాలానగర్ నుంచి గంగాపూర్ వరకు రాకపోకలకు కీలకమైన ఈ మార్గాన్ని అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తే పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఇకనైనా అధికారులు స్పందించి రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి... శవంతో రాస్తారోకో..

- రూ.15 లక్షల పరిహారానికి అంగీకారం

**కల్వకుర్తి, అక్టోబర్ 06 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం రాచాలపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై ఇంటి పెద్ద దిక్కు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. తిమ్మనపల్లి గ్రామా నికి చెందిన శ్యామ్ ముదిరాజ్ కేఎల్ఐ కాల్వలోని బోరు మోటారు మరమ్మతు చేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. కుటుంబ పోషణ కోసం వ్యవసాయం, కౌలు సాగుచేసే శ్యామ్ మృతి తో ఆయన భార్య, నలుగురు కుమార్తెలు దిక్కుతోచని స్థితిలో అనాథలుగా మిగిలి కన్నీరుమున్నీరుగా విలపించారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి





తరలించగా, తండ్రిని కోల్పోయిన నలుగురు కుమా ర్తెల రోదనలు స్థానికులను తీవ్రంగా కలచివేశాయి. బాధిత కుటుంబానికి పరిహారం అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో కల్వకుర్తి-మహబూబ్‌నగర్ చౌరస్తా లో రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, పోలీసులు పరిస్థితులను పర్యవేక్షించారు.



అనంతరం జరిగిన చర్చల్లో మృతుడి కుటుంబానికి రూ. 15 లక్షల పరిహారం అందించేందుకు అంగీ కారం కుదిరింది. ఇందులో రూ. 7.50 లక్షలను పది రోజుల్లో, మిగిలిన రూ. 7.50 లక్షలను మూడు నెలల వ్యవధిలో అందజేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇచ్చిన హామీ ప్రకారం పరిహారం త్వరగా అందించి అనాథలైన పిల్లలకు అండగా నిలవాలని బంధువులు విజ్ఞప్తి చేశారు.

## పోషకాహార లోపం లేని వనపర్తే లక్ష్యం

- సామ్, మ్యామ్ పిల్లలను పూర్తిగా తగ్గించాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** జిల్లాలో చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని పూర్తిగా నివారించి, వనపర్తిని సామ్, మ్యామ్ పిల్లలు లేని జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మహిళలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.
మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా 9వ పోషణ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతేడాది జిల్లాలో 438 మంది సామ్ పిల్లలు ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 106కు తగ్గిందన్నారు. మిగిలిన పిల్లలకు కూడా అవసరమైన పోషకాహారం, వైద్య సేవలు అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. సామ్, మ్యామ్ పిల్లలను గుర్తించిన వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైతే పోషక పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శిశువులకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, తల్లిపాల ప్రాధాన్యంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని తెలిపారు.
పోషణ మాసం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన అంగన్వాడీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు హరికృష్ణ, సుధారాణి, డా. భాస్కర్ నాయక్, డీపీఆర్వో సీతారాం, సీడీపీఓలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లమల ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..

### గద్వాలకు చెందిన ఇద్దరు యువకులు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు





**గద్వాల, అక్టోబర్ 10(జనంసాక్షి):** నల్లమల అటవీ ఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం రాత్రి/మంగళవారం తెల్లవారుజామున కర్నూలు నుంచి కాకినాడ వెళ్తున్న హైటెక్ ఆర్టీసీ బస్సు, ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బొలెరోలో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.మృతులను జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. దేవేందర్ 23, ఎక్స్ పూర్, అయిజ మండలం, నితిన్ 22, తాటికుంట, మల్దకల్ మండలం గుంటూరు నుంచి అయిజకు వస్తుండగా దోర్నాల – ఆత్మకూరు మధ్య ఈ ఘటన జరిగినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

## కోనోకార్పస్ చెట్లపై చర్యలు తీసుకోవాలి: హైకోర్టు ఆదేశం



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి):** సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని కోనోకార్పస్ చెట్ల తొలగింపుపై సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్ గౌడ్ సమర్పించిన వినతిని పరిశీలించి, చట్టప్రకారం నాలుగు వారాల్లో చర్యలు పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా అధికారులను ఆదేశించారు. కోనోకార్పస్ చెట్ల వల్ల శ్వాసకోశ అలర్జీలు, ఉబ్బసం వంటి ఆరోగ్య సమస్యలతో పాటు భూగర్భజలాల క్షీణత, జీవవైవిధ్య నష్టం జరుగుతోందని చక్రధర్ గౌడ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణలో ఆయన తరపు న్యాయవాది రేకులపేట సుధాకర్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు కేసుకు సంబంధించిన పత్రాలు, కేంద్ర సాధికార కమిటీ (CEC) నివేదికను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శీతాకాల సమీపిస్తున్నందున ఈ అంశంపై సత్వర చర్యలు అవసరమని వాదించారు.
ఈ చెట్లను గుర్తించి వాటి స్థానంలో వేప, రావి, మర్రి వంటి స్థానిక వృక్షజాతులను నాటాలని పిటిషనర్ కోరారు. వాదనలు పరిశీలించిన హైకోర్టు, ప్రజారోగ్య ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని నాలుగు వారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రతివాదులైన అధికారులను ఆదేశిస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది.

### తారా ప్రభుత్వ కళాశాలలో

## యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సు





**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 6 (జనంసాక్షి):** సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ స్వయంప్రతిపత్తి (ఏ) కళాశాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు మరియు పోస్టర్ల తయారీ కార్యక్రమం నిర్వహించారు.
కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుచిత్ర సింగ్ మాట్లాడుతూ, విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని, కళాశాలను ర్యాగింగ్ రహిత విద్యాసంస్థగా మార్చాలని పిలుపునిచ్చారు. ర్యాగింగ్ నిరోధక కమిటీ కన్వీనర్ డాక్టర్ అశ్విని మాట్లాడుతూ, ర్యాగింగ్ తీవ్రమైన నేరమని, దీనికి పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.
ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా రూపొందించిన ఉత్తమ పోస్టర్ల రూపకర్తలకు ఈ నెల 9న ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు డాక్టర్ మిథున్, డాక్టర్ వినోద్, డాక్టర్ సోలమన్, డాక్టర్ వీరేందర్, డాక్టర్ రవీందర్ పాల్గొన్నారు.

## నశాముక్త సమాజ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కీలకం

**యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి**



జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు.

**మాదకద్రవ్యాలతో సర్వనాశనమే: ఎంపీ రఘునందన్‌రావు**

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం జీవితాలను నాశనం చేస్తుందని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

**యువత సన్మార్గంలో పయనించాలి: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు**

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనిస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు.

**కార్యక్రమాల ఆవిష్కరణ:**

అంతకుముందు గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, మంత్రి వివేక్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే రోహిత్‌రావు, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ శ్రీనివాసరావులతో కలిసి యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ ఫ్లెక్సీని ఆవిష్కరించారు. అలాగే గ్రామీణాభివృద్ధి శాఖ స్టాళ్లను పరిశీలించి, రెడ్‌క్రాస్ ప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, వివిధ శాఖల అధికారులు, పోలీసులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మండలం లో మంత్రి పొన్నం విస్తృత పర్యటన





కాచాపూర్, సీసీపల్లి గ్రామాలకు చెందిన సుమారు 1,100 ఎకరాలకు సాగునీరు అందించేలా 20 ఏళ్లుగా కలగా ఉన్న గౌరవెల్లి కాలువ నీటిని తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. సిసి పల్లి , కాచాపూర్ రెండు గ్రామాలకు సంబంధించి భూములు కోల్పోయిన దాదాపు 118 మంది రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా కాచాపూర్ గ్రామానికి సంబంధించి కోహెడ నుంచి మైసంపల్లి వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.8 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. సీసీపల్లి, మైసంపల్లి, కాచాపూర్ గ్రామాలను అనుసంధానిస్తూ రూ.8.3 కోట్ల నిధులతో రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.
గ్రామంలో నీటిని వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు నీటి కుంటలను నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు చేపట్టేలా అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో, డీఆర్‌డీఓ, డీపీఓ, ఆయా గ్రామాల సర్పంచ్ లు కొమురయ్య, బుర్ర కళ్యాణి – మహేష్ , పోలు శ్రీనివాస్, తిమ్మాపురం సంపత్,రాయనబోయిన లత – శ్రీనివాస్ అధికారులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు , మహిళా సంఘ ప్రతినిధులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి, కాంట్రాక్ట్ కరోబార్

ఫిర్యాదుదారుడి పేరుపై ఉన్న రెండు ఇళ్లకు సంబంధించిన మ్యుటేషన్ దరఖాస్తు ఫైల్‌ను ఫార్వర్డ్ చేసి ప్రాసెస్ చేయడం కోసం పంచాయతీ కార్యదర్శి తొలుత రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. అనంతరం బేరసారాల తర్వాత రూ.15 వేలకు లంచం మొత్తం తగ్గించినట్లు పేర్కొంది. కరోబార్ ద్వారా లంచం స్వీకరణ ఏసీబీకి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. ఏ
మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో జక్కాపూర్ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ కరోబార్ దాసరి సంతోష్ ద్వారా రూ.15 వేల లంచం స్వీకరిస్తుండగా ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. కాంట్రాక్ట్ కరోబార్ వద్ద నుంచి రూ.15 వేల కలుషిత లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యదర్శి అరుణ, కాంట్రాక్ట్ కరోబార్ సంతోష్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్ పీఈ ఒ ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని వెల్లడించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏసీబీ స్పష్టం చేసింది.

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

- సిద్దిపేటలో ఇండియా కూటమి ధర్నా



**సిద్దిపేట, అక్టోబర్ 06 (జనంసాక్షి):** 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పేరుతో హేతుబద్ధత లేకుండా ఓట్ల తొలగింపును నిరసిస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తన రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్‌ను వాడుకుంటోందని నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తుంకుంట ఆంక్ష రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లను ఏ ప్రాతిపదికన తొలగించారో కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఓటరుకు తిరిగి ఓటు హక్కు కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ దరిపెల్లి చంద్రం, వామపక్ష మరియు ఇండియా కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.